


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 204 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం గురువారం 4 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 204 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM THU 4 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# అమరావతి స్మార్ట్ సిటీకి భాగస్వామ్యం..

## రష్యా 'ఎలిమెంట్ గ్రూప్'కు నారా లోకేష్ ఆఫర్

- రష్యా సెమీకండక్టర్ దిగ్గజం ఎలిమెంట్ గ్రూప్‌తో మంత్రి లోకేష్ భేటీ
- విశాఖ, నెల్లూరు, శ్రీసిటీలలో తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- సెమీకండక్టర్, రోబోటిక్స్, ఎలక్ట్రానిక్ రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం
- ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన ఎలిమెంట్ గ్రూప్
- అంతర్గత చర్చల అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటన



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను హై–టెక్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటి స్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా, మాస్కోలో రష్యాకు చెందిన ప్రముఖ సెమీకండక్టర్ల తయారీ సంస్థ 'ఎలిమెంట్ గ్రూప్' ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో ఆయన సమావేశమ య్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు.
ఈ సమావేశంలో ఎలిమెంట్ గ్రూప్ ప్రెసిడెంట్ ఖజోవ్ ఒలెగ్, ఇతర డైరెక్టర్లతో భేటీ అయిన మంత్రి లోకేష్, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తయారీ, డిజైన్ యూనిట్లను స్థాపించాలని ఆహ్వానించారు. భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న డిజిటల్

- మిగతా 2లో




# కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం..

## హాజరైన రాహుల్, ఖర్గే

- ప్రమాణం చేయించిన గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్
- కేబినెట్లో సిద్ధరామయ్య తనయుడికి చోటు
- ప్రమాణానికి ముందు డీకేకు ఫోన్ చేసిన సోనియా గాంధీ
- అందరినీ కలుపుకుని పనిచేస్తానని సోనియాకు హామీ ఇచ్చిన డీకే

- మిగతా 2లో



# కోటి మందితో యోగాంధ్ర-2026: సీఎం చంద్రబాబు ప్రకటన

- జూన్ 21న కోటి మందితో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం
- 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' థీమ్‌తో యోగాంధ్ర-2026 కార్యక్రమం
- పర్యాటక కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక యోగా ప్రదర్శనలు
- యోగాంధ్ర కోసం రూ.10 కోట్ల బడ్జెట్, ప్రత్యేక పోర్టల్ ప్రారంభం
- జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది భాగస్వామ్యంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్స వాన్ని 'యోగాంధ్ర–2026' పేరుతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జూన్ 21న జరిగే ఈ కార్యక్రమ నిర్వహణ, లక్ష్యాలపై ఆయన అమరావతిలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానం యోగా అని, దానిని ప్రజా ఉద్యమంగా మార్చి ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ ఏడాది 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' (వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించడం) థీమ్‌తో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. "యోగా కేవలం ఒక్కరోజు కార్యక్రమం

- మిగతా 2లో



# పవన్‌పై వ్యాఖ్యలు కరెక్ట్ కాదు..

## తెలంగాణ నేతలకు చంద్రబాబు హితవు

- తెలంగాణలో పవన్ పై వ్యాఖ్యలను ఖండించిన సీఎం చంద్రబాబు
- విద్వేషాలు రెచ్చగొట్టే మాటలు మాట్లాడటం సరైన పద్ధతి కాదు
- రాష్ట్రం విడిపోయి 12 ఏళ్లయ్యాక అనవసర వివాదాలు తగదు
- అభివృద్ధి, ప్రజాసేవలో పోటీ పడాలని రాజకీయ నాయకులకు పిలుపు

- మిగతా 2లో

# ఏపీకి ఐదు రోజుల పాటు వర్ష సూచన

- 24 గంటల్లో కేరళలోకి ప్రవేశించనున్న నైరుతి రుతుపవనాలు
- మధ్యప్రదేశ్ నుంచి రాయలసీమ వరకు కొనసాగుతున్న ద్రోణి
- వీటి ప్రభావంతో ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

పెన్ పవర్ డెస్క్:దేశవ్యాప్తంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాల రాకపై వాతావరణ శాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది. రాబోయే 24 గంటల్లో ఈ రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించనున్నట్లు అధికారులు వెల్లడించారు. తద్వారా ఇవి క్రమంగా దేశంలోని మిగతా ప్రాంతాలకు విస్తరించనున్నాయి. గురువారం నాటికి నైరుతి రుతుపవనాలు.. నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్ర ప్రాంతాలు, లక్షద్వీప్ దీవులు, కేరళతో పాటు తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు అనుకూల వాతావరణం ఉందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది.మరోవైపు, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో.. మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ,

- మిగతా 2లో



# ఉచిత న్యాయ సహాయం, కోర్టు ఖర్చుల బాధ్యత వైసీపీదే..

## డీఎస్సీ అభ్యర్థులకు వైఎస్ జగన్ భరోసా

- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్ చేశామన్న జగన్
- వైసీపీ అధికారంలోకి రాగానే అక్రమాలపై రీ-ఎంక్వైరీ చేయిస్తామని వెల్లడి
- క్రీడా కోటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని విమర్శ

2లో





ప్రాంతీయవాదం ఉగ్రవాదం అయితే...

# మీరే ఉగ్రవాదులు

## పవన్ కల్యాణ్ పై నిరంజన్ రెడ్డి ఫైర్

- ఆంధ్రరాష్ట్ర పునాదులపై ఏర్పడిందే అసలైన ప్రాంతీయవాదం అన్న నిరంజన్ రెడ్డి
- తెలంగాణ ప్రజలు జాతీయవాదులు అని వ్యాఖ్య
- పక్క రాష్ట్ర నేతలు తెలంగాణను వెక్కిరిస్తుంటే రేవంత్ ఎందుకు మనంగా ఉన్నారని ప్రశ్న

- మిగతా 2లో



# ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం.. 21 మంది సజీవ దహనం

- లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఘటన
- పలువురికి తీవ్ర గాయాలు
- 37 మందిని కాపాడిన పోలీసులు
- మంటల్ని అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది
- చినపోయిన వారికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని

పెన్ పవర్ డెస్క్:ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 21 మంది సజీవ దహనమయ్యారు. అనేక మందికి తీవ్ర గాయాలయ్యాయి. 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి

- మిగతా 2లో

తెలంగాణ ప్రజల్లో 'తెలంగాణ' అనే భావన ఉంటుంది...

# కానీ ఆంధ్రా ప్రజల్లో 'ఆంధ్రా' అనే భావన లోపించింది

- తెలంగాణ ప్రజలను చూస్తే ముచ్చటగా ఉంటుందన్న పవన్ కళ్యాణ్
- తెలంగాణ అనే బలమైన భావన వారిలో ఉందని ప్రశంస
- ఆంధ్రాలో మాత్రం ఐక్యత లేదని, ఉప ప్రాంతీయతలే ఉన్నాయని ఆవేదన
- ఆంధ్రా ప్రజల్లో కనీసం 'ఆంధ్ర' అనే ఉమ్మడి గుర్తింపు ఉండాలన్న పవన్

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ ప్రజల్లో 'తెలంగాణ' అనే బలమైన ఐక్యతా భావన ఉందని, దాన్ని చూస్తే తనకు ముచ్చట వేస్తుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో అలాంటి ఉమ్మడి భావన కొరవడిందని, ఇక్కడ ఐక్యతకు బదులుగా

- మిగతా 2లో




# భారత్‌పై అమెరికా మళ్లీ టారిఫ్స్..

## కేంద్రం స్పందన ఇదే..!

- వెట్టిచాకిరి చేయించి ఉత్పత్తులు తయారుచేయించారని అమెరికా ఆరోపణ
- అందుకుగానూ 12.5 శాతం పన్ను విధించాలని ప్రతిపాదన
- ఇది ఇంకా ఖరారు కాలేదని కేంద్రం ప్రభుత్వం వివరణ
- వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు సాగుతున్నట్లు వెల్లడి

పెన్ పవర్ డెస్క్:భారత వస్తువులపై అమెరికా మరోసారి అదనపు సుంకాలు విధించ నుందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ విషయంపై అగ్రరాజ్యంతో నిరంతరం చర్చిస్తున్నామని, ఈ పన్నుల ప్రతిపాదన ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేసింది. కార్మికులతో వెట్టిచాకిరి చేయించి ఉత్పత్తులు తయారు చేయించారంటూ భారత్‌తో సహా 60 దేశాలపై

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# జగన్ కు బీఆర్ఎస్ పోయి.. కవిత వచ్చే...!

వైసీపీ అధినేత జగన్‌కు ఇరుగు పొరుగు రాష్ట్రాల మద్దతు ఉన్న విషయం తెలిసిందే. సమయం చూసుకు ని స్పందించే నాయకులు ఉన్నారు. అయితే.. ఒక్కొక్కసారి ఆయనను విమర్శించిన పొరుగు రాష్ట్ర నేతలు కూడా కనిపిస్తారు. హరీశ్‌రావు, కేటీఆర్‌వంటి తెలంగాణ నాయకులు జగన్‌కు మిత్రులే అయినా.. సమయం సందర్భం చూసుకుని ఆయనను సమర్థించారు. ఒక్కొక్కసారి తీవ్రంగా విమర్శించారు. 4 వేల కోట్ల కోసం.. జగన్.. రైతులను ఫణంగా పెట్టారంటూ.. గతంలో హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అప్పట్లో రైతులు వాడే విద్యుత్‌కు స్మార్ట్ మీటర్లు పెట్టే నిర్ణయం తీసుకున్నారు జగన్. ఇది కేంద్ర ప్రభు త్వం చెప్పడంతోనే .. చేశారని హరీశ్‌రావు చెప్పారు. అంతేకాదు.. ఇలా చేస్తే.. కేంద్రం నుంచి 4 వేల కోట్ల రూపాయల మేరకు జగన్ ప్రభుత్వానికి అప్పుగా వస్తోందన్నారు. ఇది రాజకీయంగా జగన్‌కు ఇబ్బంది సృష్టించింది. ఇక, కేటీఆర్ కూడా.. ఏపీలో వైసీపీ పాలనా సమయంలో నెలకొన్న సమస్యలను ప్రస్తావించి ..ఇరుకున పడేశారు. ఏపీలో ఎక్కడ చూసినాగుంతల రోడ్లే ఉన్నాయని.. తన స్నేహితులు చెప్పారంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ.. జగన్ బీఆర్ఎస్ నాయకుల తో కలివిడిగానే ఉంటున్నారన్న చర్చ ఉంది. కట్ చేస్తే.. ఇప్పుడు బీఆర్ఎస్ స్థానంలో కవిత తెరమీదికి వచ్చారు. నేరుగా జగన్‌ను ఆమె సమర్థించకపోయినా.. అసందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు.. వైసీపీలో చర్చకు దారితీశాయి. జగన్ రాజధాని విషయంలో చేసిన -మావిగన్- ప్రకటనను కవిత స్వాగతిస్తున్నట్టుగా మాట్లాడారు. దీనిని అడ్డు పెట్టుకుని కూటమి ప్రభుత్వంపైనా ముఖ్యంగా సీఎం చంద్రబాబుపైన, రాజధాని అమరావతిపైనా విమర్శలు గుప్పించారు. దీంతో వైసీపీ నాయకులు తమ కు బూస్ట్ వచ్చిందని అనుకుంటున్నారు. కానీ, ఇది వాపే తప్ప బలుపు కాదని.. తెలంగాణ నాయకులను విశ్వసించడం సరికాదని చెబుతున్న వారు కూడా ఉన్నారు. ఎప్పుడు ఎలాంటి టర్న్ తీసుకుంటారో తెలియని.. కవిత గారి లాంటి నాయకులను నమ్మితే.. నిండా మునగడం కాయమ ని అంటున్నారు. కాబట్టి.. కవిత ఏదో చెప్పారని.. చంద్రబాబుపై విమర్శలు గుప్పించారని.. పొంగిపోతే.. అది మొత్తానికే ఇబ్బంది అవుతుందని చెబుతున్న నాయకులు కూడా ఉన్నారు.

## ఉచిత న్యాయ సహాయం, కోర్టు ఖర్చుల బాధ్యత వైసీపీదే..

డీఎస్సీ పరీక్షల్లో తీవ్ర అన్యాయం జరిగిందంటూ ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు తమ మద్దతు ఉంటుందని వైసీపీ అధినేత జగన్ ప్రకటించారు. బాధితుల పక్షాన నిలిచి వారికి అవసరమైన ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని, కోర్టు ఖర్చులన్నింటినీ తమ పార్టీయే భరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. డీఎస్సీ అక్రమాలపై ఇప్పటికే సీబీఐ విచారణకు డిమాండ్ చేశామని గుర్తుచేసిన ఆయన.. భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ అక్రమాలపై రీ-ఎంక్వైరీ చేయించడంతో పాటు, కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక కమిషన్ కూడా వేయిస్తామని స్పష్టం చేశారు.
క్రీడా కోటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా లోపించిందని జగన్ తీవ్రంగా విమర్శించారు. ఎలాంటి పరీక్షలు లేకుండా కేవలం సర్టిఫికెట్ల ఆధారంగానే ఉద్యోగాలు ఇస్తామంటూ ప్రభుత్వం జీవో ఇచ్చిందని, చంద్రబాబు తనకు కావలసిన వారికి లబ్ధి చేకూర్చడానికే ఈ గేట్లు తెరిచారని ఆరోపించారు. అనుకున్న వారికి ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి కాగానే, మళ్లీ పాత జీవోను మార్చేసి కొత్త జీవోను తీసుకురావడంలో ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో పాలకుల స్వార్థం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు. ప్రస్తుత డీఎస్సీ నిర్వహణలో లీకేజీల దగ్గర నుంచి అనేక అవకతవకలు బయటపడుతున్నాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థులకు కూడా ఉద్యోగాలు రాలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రాలేదనే నెపంతో ఫస్ట్ ర్యాంకర్లను పక్కన పెట్టారని ప్రభుత్వం చెబుతుంటే.. మరి అదే అభ్యర్థులు న్యాయం కోసం కోర్టులను ఎందుకు ఆశ్రయిస్తున్నారని ప్రశ్నించారు. అభ్యర్థుల ఫిర్యాదులకు ప్రభుత్వం నుంచి సరైన సమాధానాలు కరవయ్యాయని, అధికారుల తీరులో తీవ్ర లెక్కలేనితనం కనిపిస్తోందని జగన్ దుయ్యబట్టారు.

# అమరావతి స్మార్ట్ సిటీకి భాగస్వామ్యం..

- మొదటి పేజి తరువాయి
రవాణా, బ్యాంకింగ్ వ్యవస్థలకు అవసరమైన ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లు, స్మార్ట్ కార్డ్ మైక్రోచిప్‌ల తయారీ కోసం విశాఖపట్నంలో ఒక ఎలక్ట్రానిక్ కాంపోనెంట్ అసెంబ్లీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, దేశీయంగా పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), సోలార్ కన్వర్టర్ల మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని నెల్లూరులో సెమీకండక్టర్ పరికరాల తయారీ యూనిట్‌ను స్థాపించాలని ప్రతిపాదించారు.
ఇప్పటికే శ్రీసిటీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆటోమోటివ్, అసెంబ్లింగ్ పరిశ్రమలకు రోబోటిక్స్, ఆటోమేషన్ సేవలు అందించేందుకు ఎలిమెంట్ గ్రూప్ తమ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని లోకేష్ సూచించారు. దీనికి తోడు, కమ్యూనికేషన్, ఏరోస్పేస్ రంగాలకు అవసరమైన మాడ్యులర్ కాంపోనెంట్లపై దృష్టి సారిస్తూ వైజాగ్ హై-టెక్ కారిడార్‌లో ఒక మైక్రోఎలక్ట్రానిక్స్ డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి స్మార్ట్ సిటీ నిర్మాణంలో భాగంగా హార్డ్‌వేర్, ఐఓటీ మౌలిక సదుపాయాల కల్పనలో భాగస్వాములు కావాలని, ఇందుకు అవసరమైన మైక్రోకంట్రోలర్లు, డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సరఫరా చేయాలని కోరారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై ఎలిమెంట్ గ్రూప్ ప్రెసిడెంట్ ఖజోవ్ ఒలెగ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నామని, ఇప్పటికే భారత టెక్ సంస్థలతో కలిసి సెమీకండక్టర్ పంపిణీ నెట్‌వర్క్‌లను నడుపుతున్నట్లు వివరించారు. దక్షిణాసియా మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలు ఆకర్షణీయంగా ఉన్నాయని తెలిపారు. తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో ఈ ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించి, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఎలిమెంట్ గ్రూప్ ప్రతినిధులు హామీ ఇచ్చారు. మాస్కో కేంద్రంగా 2019లో ఏర్పాటైన ఎలిమెంట్
గ్రూప్, రష్యాలో అగ్రగామి సెమీకండక్టర్ సంస్థగా గుర్తింపు పొందింది. ఈ సంస్థకు 30కి పైగా డిజైన్, మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాలు ఉండగా, 9 వేల మందికి పైగా నిపుణులు పనిచేస్తున్నారు. 2025 ఆర్థిక సంవత్సరంలో సంస్థ సుమారు రూ. 5,090 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఈ భేటీతో ఏపీకి సెమీకండక్టర్ రంగంలో భారీ పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## ప్రాంతీయవాదం ఉగ్రవాదం అయితే... మీరే ఉగ్రవాదులు

ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. "ఆంధ్రరాష్ట్ర పునాదులపై ఏర్పడిందే అసలైన ప్రాంతీయవాదం. ప్రాంతీయవాదం ఉగ్రవాదం అయితే, మొదట మీరే ఉగ్రవాదులు అవుతారు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. నాటి రాచరికపు పాలన అంతమై, తెలంగాణ భారతదేశంలో విలీనం కావాలని ప్రాణాలర్పించి పోరాటం చేసిన జాతీయవాదులు తమ తెలంగాణ ప్రజలని నిరంజన్ రెడ్డి అన్నారు. నాటి కాలంలో తమను బలవంతంగా ఆంధ్ర ప్రాంతంతో విలీనం చేశారని.. ఆ తర్వాత జరిగిన అన్యాయాలు, దుర్మార్గాల నుంచి విడిపోవాలనే ఇక్కడి ప్రజలు పోరాడారు తప్ప, తెలంగాణ ప్రజలు ప్రాంతీయవాదులు కారని ఆయన తేల్చి చెప్పారు. పక్క రాష్ట్రాల నాయకులు వచ్చి మన గడ్డపై నిలబడి తెలంగాణ సమాజాన్ని వెక్కిరిస్తుంటే.. ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా మౌనంగా చూస్తున్న రేవంత్ రెడ్డి తెలంగాణకు పెద్ద ద్రోహి అని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ఈ వ్యవహారంలో మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించిన తీరును అభినందించిన ఆయన.. మిగతా మంత్రులు ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. "తెలంగాణ మంత్రుల నోళ్లకు ఏమైనా పక్షవాతం వచ్చిందా?" అని ఘాటుగా ప్రశ్నించారు.
రాష్ట్రంలో అధికార పక్షం, ప్రతిపక్షాల మధ్య ఎన్ని రాజకీయ విభేదాలైనా ఉండొచ్చని.. కానీ, పొరుగు రాష్ట్రాల నేతలు వచ్చి తెలంగాణను అవమానిస్తుంటే అందరూ ఏకతాటిపైకి వచ్చి ఖండించకపోవడం దారుణమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ తెలంగాణ ప్రజల పక్షానే నిలబడుతుందని స్పష్టం చేసిన ఆయన.. ప్రభుత్వ వైఫల్యాలను, తెలంగాణకు జరుగుతున్న అవమానాలను సోషల్ మీడియా వేదికగా గట్టిగా ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

# కోటి మందితో యోగాంధ్ర-2026: సీఎం చంద్రబాబు ప్రకటన

- మొదటి పేజి తరువాయి
కాదు, ప్రతి వ్యక్తి నిత్య సాధనగా మార్చుకోవాలి. ఈ లక్ష్యంతో జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటిస్తున్నాం. జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయి" అని వివరించారు. ప్రధాన కార్యక్రమం అమరావతిలో కృష్ణానది పశ్చిమ బైపాస్ వంతెనపై 25 వేల మందితో నిర్వహిస్తామని, ప్రతి జిల్లా కేంద్రంలో 2 వేల నుంచి 3 వేల మందితో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లాలో పోలీసు సిబ్బంది, కోనసీమలో రైతులు వంటి ప్రత్యేక వర్గాలతో పాటు ఉండవల్లి గుహలు, శ్రీశైలం వంటి 56 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించి 'యోగా-టూరిజం'ను ప్రోత్సహిస్తామన్నారు. యోగాంధ్ర-2026 విజయవంతం కోసం రూ.10 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించామని, స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను, 2.50 లక్షల మంది ట్రైనర్లను తయారు చేయడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సలహాలు, సేవలు తీసుకుంటున్నామని, ఆయన రూపొందించిన 168కి పైగా వీడియోలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 81424 04888 వాట్సాప్ నంబర్‌కు 'ఎఱ' అని మెసేజ్ పంపిస్తే యోగా వీడియోలు పొందవచ్చని సూచించారు.
ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా yogandhra.ap.gov.in పోర్టల్‌ను ప్రారంభించామని, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఇషా ఫౌండేషన్, బ్రహ్మకుమారీస్ వంటి సంస్థల భాగస్వామ్యం కూడా తీసుకుంటున్నట్లు సీఎం వెల్లడించారు. గతేడాది యోగాంధ్ర కార్యక్రమానికి 2.44 కోట్ల మంది నమోదు చేసుకున్న స్ఫూర్తితో ఈసారి కూడా కార్యక్రమాన్ని విజయవంతం చేసి, యోగాను 365 రోజుల ఉద్యమంగా కొనసాగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు.

# భారత్‌పై అమెరికా మళ్లీ టారిఫ్స్..

- మొదటి పేజి తరువాయి
సెక్షన్ 301 కింద అదనపు సుంకాలు విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదించిన విషయం తెలిసిందే.
దీనిపై కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పందిస్తూ అమెరికాతో వాణిజ్య ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు చర్చలు కొనసాగుతున్నాయని తెలిపింది. ఈ పన్నుల ప్రతిపాదన ఇంకా ప్రజాభిప్రాయ సేకరణ దశలోనే ఉందని పేర్కొంది. సంబంధిత వర్గాలు 2026 జూన్ 22లోపు తమ విజ్ఞప్తులను సమర్పించవచ్చని, జులై 7 తర్వాతే అమెరికా తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేసింది.
ఇప్పటికే సెక్షన్ 232 కింద ఉన్న కొన్ని ఉత్పత్తులకు ఈ కొత్త పన్నుల నుంచి మినహాయింపు లభించింది. అలాగే టెక్స్‌టైల్ రంగానికి అమెరికా ప్రత్యేక వెసులుబాటును ప్రతిపాదించింది. దీని ప్రకారం
నిర్దేశిత పరిమాణంలోని దుస్తుల దిగుమతులపై తక్కువ పన్ను రేట్లు విధించే అవకాశం ఉంది. పరస్పర వాణిజ్య ఒప్పందాలు అంగీకరించే దేశాలకు ఈ పన్ను 10 శాతంగా ఉంటుంది. ప్రస్తుతానికి చర్చలు నడుస్తున్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భారత్ వెల్లడించింది.

# ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం.. 21 మంది సజీవ దహనం

- మొదటి పేజి తరువాయి
వరకు 40 మందిని కాపాడారు. మాలవీయనగర్‌లోని లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఉదయం 9 గంటల సమయంలో మంటలు చెలరేగుతున్నట్లు గుర్తించారు.
సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు షార్ట్ సర్క్యూటే కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా
నిర్ధారించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స కోసం రూ.50 వేలు అందజేస్తామన్నారు.

## తెలంగాణ ప్రజల్లో 'తెలంగాణ' అనే భావన ఉంటుంది... కానీ ఆంధ్రా ప్రజల్లో 'ఆంధ్రా' అనే భావన లోపించింది

- మొదటి పేజి తరువాయి
ఉప ప్రాంతీయతలు, కులాల ప్రాబల్యం ఎక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడిన పవన్, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య ఉన్న ప్రాంతీయ అస్తిత్వంపై ఆసక్తికర విశ్లేషణ చేశారు. "తెలంగాణ ప్రజలను చూస్తే ఎందుకు ముచ్చటేస్తుందంటే, వారిలో తెలంగాణ అనే భావన ఉంటుంది. తమిళులకు వారి భాషా, ప్రాంతంపై అభిమానం ఉంటుంది. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో 'ఆంధ్రా' అనే ఉమ్మడి భావన కొరవడింది. ఇక్కడ సబ్-రీజనలిజం, కులతత్వమే ఎక్కువ" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను 'జై ఆంధ్ర' అని నినాదం ఇచ్చింది కూడా అందుకేనని పవన్ స్పష్టం చేశారు. కనీసం 'మేమంతా ఆంధ్ర' అనే ఒక ఉమ్మడి గుర్తింపు రాష్ట్ర శ్రేయస్సు కోసం అవసరమని తాను భావిస్తున్నట్లు తెలిపారు. తన సూచనను ఉన్మాద స్థాయికి తీసుకెళ్లమని కాకుండా, రాష్ట్రం కోసం కనీస ఐక్యతను పెంపొందించుకోవాలనే ఉద్దేశంతోనే ఆ మాట చెప్పానని వివరించారు. ఈ రకమైన ఉప ప్రాంతీయతలతో రాష్ట్రం ఇప్పటికే అన్ని రకాలుగా విడిపోయిందని, ఇకనైనా కలపడానికే ప్రయత్నించాలని ఆయన అన్నారు.

## ఏపీకి ఐదు రోజుల పాటు వర్ష సూచన

- మొదటి పేజి తరువాయి
రాయలసీమ మీదుగా ఉత్తర తమిళనాడు వరకు ఒక ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాబోయే ఐదు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల బలమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. రుతుపవనాల విస్తరణతో ఎండల తీవ్రత తగ్గి, ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పట్టనున్నాయి.

## కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం.. హాజరైన రాహుల్, ఖర్గే

కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లోని గ్లాస్ హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఆయనతో ప్రమాణం చేయించారు. డీకే శివకుమార్ రాజ్యాంగం చేతపట్టుకుని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, మల్లు భట్టివిక్రమార్క తదితరులు హాజరయ్యారు. డీకే శివకుమార్ కేబినెట్‌లో మాజీ సీఎం సిద్ధరామయ్య తనయుడు యతీంద్రకు చోటు దక్కింది. పరమేశ్వర ఏకైక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కర్ణాటక కొత్త మంత్రివర్గంలో 12 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తనకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారని డీకే శివకుమార్ వెల్లడించారు. పార్టీలో అందరినీ కలుపుకుని ముందుకు సాగాలని ఆమె సూచించినట్లు తెలిపారు. తన నాయకత్వంపై సోనియా గాంధీ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు డీకే శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ, "సోనియా గాంధీ నాతో ఫోన్‌లో మాట్లాడారు. మొదటి నుంచి నాపై ఆమెకు చాలా నమ్మకం ఉంది. నన్ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది సోనియానే. అందరినీ కలుపుకుని పనిచేయాలని ఆమె సూచించారు. ఆమె నమ్మకాన్ని నిలబెడతానని, అందరినీ కలుపుకుని ముందుకు వెళతానని నేను హామీ ఇచ్చాను" అని వివరించారు.

## పవన్‌పై వ్యాఖ్యలు కరెక్ట్ కాదు..

తెలంగాణలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సరైన పద్ధతి కాదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు. ఇలాంటి మాటలతో అనవసర సమస్యలు సృష్టించవద్దని, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు ఫలించవని ఆయన స్పష్టం చేశారు.
తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో తన యూనిట్‌ను ఏర్పాటు చేసుకుందని చంద్రబాబు గుర్తుచేశారు. అప్పుడు ఏపీలో ఎలాంటి అభ్యంతరాలు తెలపలేదన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయి ఇప్పటికే 12 ఏళ్లు దాటిపోయిందని.. ఈ సుదీర్ఘ కాలంలో ఎవరెవరు ఏం చేశారనేది రెండు రాష్ట్రాల ప్రజలకు చాలా స్పష్టంగా తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. ఏవైనా సమస్యలు లేదా భేదాభిప్రాయాలు ఉంటే రాజకీయంగా, లాజికల్‌గా ముందుకెళ్లాలి తప్ప.. ఇలాంటి వ్యాఖ్యలతో రాష్ట్రాల్లో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టవద్దని సూచించారు. "తెలంగాణలో పవన్ కళ్యాణ్ గారిపై కొందరు రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సరైన పద్ధతి కాదు. ఇలాంటి మాటలు మాట్లాడి లేనిపోని సమస్యలు సృష్టించకూడదు. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత ఇప్పుడు అనవసరంగా మాట్లాడి విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నారు. కానీ అది సాధ్యం కాదు. ఏ ప్రాంతానికి ఎవరు ఏం చేశారో ప్రజలకు బాగా తెలుసు. నేను ఇటీవలే తమిళనాడులో ఎన్నికల ప్రచారానికి వెళ్లి వచ్చాను. అక్కడకు కర్ణాటకతో పాటు దేశంలోని అన్ని ప్రాంతాల నేతలు వచ్చారు. కర్ణాటక నుంచి డీకే శివకుమార్ కూడా వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉన్నాయి. ఆ బీఆర్ఎస్ జాతీయ పార్టీ అని చెప్పి ఆంధ్రప్రదేశ్‌లో కూడా విస్తరిస్తామని అన్నారు. మరి ఇప్పుడు ఎందుకిలా మాట్లాడుతున్నారో నాకైతే అర్థం కావడం లేదు. ఇది సరైన విధానం కాదు. ఈ రోజు అమెరికా, ఆస్ట్రేలియా, యూకే వంటి దేశాల్లో ఎంతోమంది తెలుగువారు రాజ్యాంగ పదవుల్లో ఉన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లో మనవాళ్లు పదవులు చేపట్టి, అక్కడి రాజ్యాంగం ప్రకారం పనిచేస్తున్నారు. ప్రజలకు ఎవరు మంచి సేవ చేస్తే వారే ఆయా ప్రాంతాల్లో నాయకులు అవుతారు. రాజకీయ నాయకులు అభివృద్ధిలో, ప్రజా సేవలో పోటీ పడాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై దృష్టి పెట్టాలి. అంతేకానీ ఇలాంటి విమర్శలతో ప్రజల మధ్య దూరం పెంచకూడదు" అని చంద్రబాబు హితవు పలికారు.

# హిందు ధర్మ పరిరక్షణ ట్రస్ట్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ గా గోరుగంతు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 3** :శ్రీ రాధాకృష్ణ కళాక్షేత్ర వ్యవస్థాపకులు గౌరవనీలు డా గోరుగంతు నారాయణ ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం హిందు ధర్మ పరిరక్షణ ట్రస్ట్ రాష్ట్ర సాంస్కృతిక శాఖా కో-ఆర్డినటర్ గా నియమించారు.హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ చైర్మన్, డా. దాసరి శ్రీనివాసులు బుధవారం డా గోరుగంతు బీ నారాయణ కి నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం శైవక్షేత్ర వ్యవస్థాపకులు శివ స్వామి సత్కారించారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# ఎస్ఐఆర్ కి యంత్రాంగాన్ని సిద్ధం చేయాలి



- ఓటర్లకు టోల్ ఫ్రీ నంబర్ 1950 తో సహాయం
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 3** :ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ బుధవారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ కీర్తి చేకూరి, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఇంచార్జి డీఆర్వో ఎస్. భాస్కర్ రెడ్డి, ఆర్డీవో కె ఆనంద్ రావు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తహశీల్దార్లు పాపారావు, బి నాగరాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ మాట్లాడుతూ, జూన్ 5 నుంచి ప్రారంభమయ్యే ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపట్టిక ప్రకారం సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. రాజకీయ పార్టీలతో సమన్వయం, బీఎల్వో లు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ, ఇంటింటి సర్వే, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ మాట్లాడుతూ, జూలై 5 నుంచి ప్రారంభమయ్యే ఎస్ఐఆర్ తదుపరి దశల అమలుకు అవసరమైన యంత్రాంగాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరును ఎన్నికల జాబితాలో చేర్చడం, ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, ఓటర్ల మ్యాపింగ్, క్లెయిమ్స్ , అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రజల్లో విస్తృత అవగాహనకు సోషల్ మీడియా వేదికలను వినియోగించాలన్నారు.

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, తూర్పు గోదావరి జిల్లాలో ఎన్నికల నిర్వహణను సమర్ధవంతంగా చేపట్టేందుకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ లో 1,581 పోలింగ్ స్టేషన్లకు అదనంగా 217 కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు పంపి చామన్నారు. 2026 జూలై 1ను అర్హత తేదీగా నిర్ణయించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణను చేపడుతున్నట్లు కలెక్టర్ కీర్తి తెలిపారు. జూన్ 5 నుంచి 14 వరకు శిక్షణా కార్యక్రమాలు, జూన్ 15 నుంచి జూలై 14 వరకు బీఎల్వోల ఇంటింటి సర్వే, జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రచురణ జరగనున్నట్లు వివరించారు. నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

25-05-2026 నాటికి జిల్లాలోని 16,25,708 మంది ఓటర్లలో 10,88,561 మంది (66.96 శాతం) ఓటర్ల మ్యాపింగ్ పూర్తికాగా, 5,37,147 మంది ఓటర్ల మ్యాపింగ్ ఇంకా మిగిలి ఉందన్నారు. అత్యధికంగా అనపర్తి నియోజకవర్గంలో 78.55 శాతం మ్యాపింగ్ పూర్తికాగా, రాజమహేంద్రవరం రూరల్‌లో 50.44 శాతం, రాజమహేంద్రవరం సిటీలో 55.64 శాతం మ్యాపింగ్ నమోదైందన్నారు. జిల్లాలో 2,53,656 మంది ఓటర్ల వివరాల మ్యాపింగ్ చేయవలసి ఉందన్నారు. ఓటర్ల సహాయార్థం టోల్ ఫ్రీ నంబర్ 1950 పని చేస్తుండగా, జిల్లాలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నా మన్నారు.

# ఉదయం భగ భగలు.. సాయంత్రం ప్రకృతి ప్రకోపం





**తాళ్లపూడి, పెన్ పవర్, జూన్ 3:**మండల ప్రజలు ఒకే రోజులో రెండు విభిన్న వాతావరణ విపత్తులను చవిచూశారు. మంగళవారం ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ మండుటెండలతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేయగా.. సాయంత్రానికి ఒక్కసారిగా ప్రకృతి రూపం మార్చుకుని భీకర ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిపించింది. ఉదయం అగ్నిగుండంలా మండిన మండలం సాయంత్రానికి గాలివాన బీభత్సంతో అతలాకుతలమైంది. తీవ్ర ఎండలు, వడగాల్పులు, ఆతర్వాత గాలివానతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాళ్లపూడి మండలంలో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 7 గంటలకే 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవడంతో భానుడిప్రభావం ఎంత తీవ్రంగా ఉందో స్పష్టమైంది. ఉదయం 9 గంటలకల్లా ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారిపోయాయి. అత్యవసర పనులు మినహా ప్రజలు బయటకు రావడానికి సాహసం చేయలేదు. వేడి గాలులు నడిరోడ్డుపై నిప్పుల వర్షం కురుస్తున్నట్లుగా పరిస్థితిని సృష్టించాయి. వడగాల్పుల తీవ్రత కారణంగా ద్విచక్ర వాహనదారులు, చిరు వ్యాపారులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి వరకు వేడి గాలుల ప్రభావం కొనసాగింది. ఎండ తీవ్రతతో విద్యుత్ వినియోగం భారీగా పెరగడంతో కొన్ని ప్రాంతాల్లో లో-వోల్టేజ్ సమస్యలు తలెత్తాయి. జ్యూస్ సెంటర్ల దుకాణాలు, కొబ్బరి బోండాల వ్యాపారాలకు భారీగా డిమాండ్ పెరిగింది. మరోవైపు వడదెబ్బ, డీహైడ్రేషన్ బాధితుల సంఖ్య కూడా పెరిగింది.

అయితే మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈశాన్య దిశ నుంచి దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో మండలంలో భీకర ఈదురు గాలులు విరుచుకుపడ్డాయి. సుమారు గంటకు 60 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు మండల వాసులను వణికించాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో రోడ్లపైకి నీరు చేరింది. ఈదురు గాలుల ధాటికి పలు చోట్ల ఫ్లెక్సీలు, హోర్డింగులు నేలకొరిగాయి. చెట్ల కొమ్మలు విరిగి రహదారులపై పడటంతో మంగళవారం రాత్రి గూటాల, తాళ్లపూడి రహదారి మధ్య ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ తీగలు దెబ్బతినడంతో సరఫరా నిలిచిపోయింది. వర్షం సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు రోడ్ల పక్కన ఆశ్రయం పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుమారు 3గంటల పాటు కురిసిన వర్షంతో మండల వాసులు మండుటెండల నుంచి ఉపశమనం పొందారు. వాతావరణంలో ఒక్కసారిగా చోటుచేసుకున్న మార్పులతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. వాతావరణ నిపుణుల అభిప్రాయం ప్రకారం, తీవ్ర ఉష్ణోగ్రతలు, ఉపరితల వేడి కారణంగా వాతావరణ అస్థిరత పెరిగి ఈదురు గాలులతో కూడిన వర్షాలు నమోదవుతున్నాయని, రానున్న రోజుల్లో కూడా ఇదే తరహా పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# తెలుగు చిత్ర సీమలో మహా మనిషి ఎస్పీ బాలు

**బాలుకి పాటలతో రాకా సంస్థ నివాళి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 3:** గాన గాంధర్వ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తెలుగు చిత్ర సీమలో మహామనిషి అని రాకా సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు డాక్టర్ కంటే వీరన్న చౌదరి అన్నారు. తెలుగు భాష ఔనత్యం కోసం పరితపించారన్నారు. ఎస్ పి బాల సుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా గోకవరం బస్టాండ్ సమీపంలోని ఎస్పీ బాలు సాంస్కృతిక మందిరంలో రాకా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్వరార్చన వేడుక నిర్వహించారు. తొలుత బాలు చిత్ర పటానికి పలువురు పుష్పాంజలి ఘటించారు. రాకా కార్యదర్శి జివి రమణ మాట్లాడుతూ ధవలేశ్వరంలో కాటన్ బ్యారేజీ వద్ద ఎస్పీ బాలు విగ్రహావిష్కరణ గురువారం జరుగుతుందన్నారు. శ్రీ సూర్య భాస్కరేంద్ర సరస్వతి స్వామి,శ్రీ జ్ఞాన సరస్వతి పీఠం వ్యవస్థాపకులు తోట సుబ్బారావు, రాకా కార్యదర్శి జివి రమణ, ఆడిట్ ఆఫీసరు రామారావు , కె ఏ రావు, నాగరత్నం తదితరులు ఎస్పీ బాలు గొప్ప తనాన్ని కొనియాడారు. బాలూతో వారికున్న అనుబంధం గుర్తు చేసుకున్నారు. ఈసందర్భంగా జరిగిన సంగీత విభావరిలో ఎస్పీ బాలు ఆలపించిన పాటలను గాయనీ, గాయకులు ఆలపించి నివాళిలు అర్పించారు.మున్సిపల్ ఇంజనీరు మదర్ షా అలీ, తిరుమల కృష్ణ మోహన్, భమిడిపాటి రామకృష్ణమూర్తి, గౌరీ శంకర్, ఎం కృష్ణ, ఎం రమేష్ , సూర్య కుమారి, కె ఏ రావు, నాగరత్నం, మోహన్ పబ్లికేషన్ ఆకుల రామచంద్ర రావు, తదితరులు పాల్గొన్నారు



# స్పందన




**ఏలూరు జూన్ 3 పెన్‌పవర్ :** ద్వారకాతిరుమల మండలం కొమ్మర గ్రామంలో 'ప్రత్యేక అధికారుల పాలనలో సమస్యలు తీరేనా' అని ఈనెల రెండవ తేదీన పెన్ పవర్ దినపత్రికలో ప్రచురితమమైన వార్తకు అధికారులు స్పందించారు.ద్వారకా తిరుమల మండలం డిప్యూటీ ఎంపిడీవో రామనాథ్ బుధవారం గ్రామాన్ని సందర్శించి గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మెరుగు పరచారు.గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద,ఇతర ప్రాంతాల్లో మురుగునీటి సమస్యలు లేకుండా పంచాయితీ పారిశుధ్య కార్మికులతో అపరిశుభ్రవాతా వరణాన్ని తొలగింప జేసి మురుగు ప్రాంతాల్లో బ్లీచింగ్ ఇతర రసాయనాలు వెదజల్లించారు.దోమలు రాకుండా దోమల మందును పిచికారి చేయించారు.దీంతో గ్రామ ప్రజలు ప్రత్యేక అధికారికి కృతజ్ఞతలు తెలిపారు.

# గంగాలమ్మ తల్లి జాతర ముగింపు..





**అడ్డతీగల, పెన్ పవర్, జూన్ 03:** గిరిజన సంప్రదాయాల్లో ఒకటైన గంగాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఏజెన్సీ ప్రాంతంలో ఘనంగా నిర్వహించడం సంప్రదాయం. గత మూడు రోజుల నుండి ఈ ఉత్సవాలు ప్రతి గ్రామంలోనూ అత్యంత వైభోగంగా జరుపుకున్నారు. బుధవారం అమ్మవారు ఉత్సవాలు ముగింపు సందర్భంగా అత్యధికంగా భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు అడ్డతీగల మండలంలో పైడి పుట్ట గ్రామ శివారు నా వెలసిన గంగాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, ముగింపు పలికారు ఈ కార్యక్రమంలో పైడి పుట్ట గ్రామస్తులు చుట్టుపక్కల 10 గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవారి ముక్కులను తీర్చుకున్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఓటర్ల జాబితా సవరణలో బీఎల్ఏలదే కీలక పాత్ర





✷ డోర్ టు డోర్ సర్వేలో చురుకుగా పాల్గొనాలి:
✷ మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 3 :** ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అత్యంత కీలక పాత్ర పోషించాలని మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. బుధవారం రంపచోడవరం ఆర్పీ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీఎల్ఏల శిక్షణ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముందు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ధనలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని బీఎల్ఏలకు సూచించారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు నిర్వహించనున్న ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని తెలిపారు. బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించడంతో పాటు, అనర్హుల ఓట్ల తొలగింపు, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించాలని కోరారు. ఓటర్ల జాబితా పటిష్టతతో పాటు పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్రీ పాపారాయుడు, ఎస్ఐఆర్ టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి వాంశెట్టి పరమేశ్వరరావు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏడు మండలాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, జిల్లా స్థాయి నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెండేళ్లు మోసం, దగాయే:



**"చంద్రబాబు వెన్నుపోటు పాలనకు రెండేళ్లు" పోస్టర్ ఆవిష్కరణ**
**మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 3 :** కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన ప్రజలను మోసగించిన దగా, దగాయే అని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి విమర్శించారు. బుధవారం రంపచోడవరం నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి "చంద్రబాబు వెన్నుపోటు పాలనకు రెండేళ్లు" పోస్టర్ను ఆమె ఆవిష్కరించారు.
అనంతరం నియోజకవర్గంలోని ఏడు మండలాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి, గురువారం మండల స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 12న నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్న భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో ఒక్క ప్రధాన హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. సూపర్ సిక్స్ హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలకు ఆడబిడ్డ నిధి అందిస్తామని ప్రకటించి ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. యువతకు ఉపాధి కల్పిస్తామని, లేకపోతే నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పి హామీలను విస్మరించారని ఆరోపించారు. పరిశ్రమల పేరుతో ప్రచారం తప్ప ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేశారని, అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడా కోటా ఉద్యోగాల భర్తీలో కూడా అవకతవకలు జరిగాయని విమర్శించారు. గత ప్రభుత్వంపై అప్పుల విషయంలో విమర్శలు చేసిన చంద్రబాబు నాయుడు, ప్రస్తుతం భారీ రుణభారం ప్రజలపై మోపారని ధనలక్ష్మి ఆరోపించారు. వైద్య రంగాన్ని నిర్వీర్యం చేయడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలను నిర్లక్ష్యం చేశారని అన్నారు. ప్రజల ఆదాయాలు పెంచే చర్యలు చేపట్టకుండా, రాష్ట్ర అభివృద్ధి పేరిట అప్పులు పెంచడమే కూటమి ప్రభుత్వ పనిగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్ఐఆర్ టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి వాంశెట్టి పరమేశ్వరరావు, ఏడు మండలాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొవ్వూరు ఎంపిడిఓ రమణ పదవీ విరమణ మహోత్సవం





**ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి**

**కొవ్వూరు, పెన్ పవర్, జూన్ 3:** కొవ్వూరు ఎంపీడీఓ తోట భక్త వెంకట రమణ పదవీ విరమణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కొవ్వూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ కుటుంబ సభ్యులు, కార్యాలయ సిబ్బంది, మండలంలోని పలు పంచాయతీల సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు మధ్య పదవీ విరమణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంపిడిఓ తోట భక్త వెంకట రమణని శాలువాతో సత్కరించి, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ సేవలో ఎన్నో సంవత్సరాల పాటు అంకిత భావంతో పనిచేసి, ప్రజలకు, గ్రామీణాభివృద్ధికి అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఉద్యోగ జీవితంలో నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వహించిన తోట భక్త వెంకట రమణ పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అదేవిధంగా తహశీల్దార్ దుర్గా ప్రసాద్ కూడా కొవ్వూరు మండలంలో ఉద్యగ భాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తారని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ(నారాయుడు) మాట్లాడుతూ ఎంపిడిఓ టి.బి.వి. రమణ ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించే వారని, పదవీ విరమణ అనంతరం మీ సలహాలు, సూచనలు అంధించాలని, మీ సలహాలు మా పార్టీ మరింత అభివృద్ధికి దోహద పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యాలయ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అవార్డులకు ముగ్గురు జిల్లా గిరిజన విద్యార్థులు ఎంపిక










**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 3 :** తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు గిరిజన విద్యార్థులు విద్యా ప్రతిభతో రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్. జ్యోతి బుధవారం తెలిపారు.
గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి జిల్లా టాపర్లు, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూన్ 5న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డులు ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఈ పురస్కారాలు అందజేయ నున్నట్లు తెలిపారు.
తూర్పు గోదావరి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, బొమ్మూరులో చదివిన చల్లా తులసి సత్య మాధవి పదో తరగతిలో 558 మార్కులు సాధించి జిల్లా టాపర్ గా నిలిచి అవార్డుకు ఎంపికైందన్నారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ (ఎంపీసీ) విభాగంలో టి . చందు 934 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించి ప్రత్యేక అవార్డుకు ఎంపికయ్యారన్నారు.
బయోపీసీ విభాగంలో గంగల్ల గాయత్రి 952 మార్కులతో జిల్లా టాపర్ అవార్డుకు ఎంపికైందని తెలిపారు. ఈ ముగ్గురు విద్యార్థులు జూన్ 5న నిర్వహించే రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందుకోనున్నారని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్. జ్యోతి తెలిపారు. విద్యార్థుల ప్రతిభ ఇతర గిరిజన విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆమె అభినందించారు.

## ఢిల్లీలో జరిగే జాతీయ సదస్సుకు వై రామవరం ఎంపీడీవో హాజరు






**వై రామవరం, పెన్ పవర్, జూన్ 3 :** కేంద్ర గిరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జూన్ మూడవ తేదీన ఢిల్లీలో జరిగే సదస్సుకు వై.రామవరం ఎంపీడీవో కే బాపన్న దొర హాజరయ్యారు.
ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో నిర్వహించనున్న ఐ టి డి పి ల,ఐ టి డి ఏ ల బలోపేతం పై జాతీయ సదస్సుకు రంపచోడవరం ఐ టి డి ఎ ప్రాజెక్టర్ ఆఫీసర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి చైతన్య కూడా జాతీయసుకు హాజరయ్యారని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జాతీయ సదస్సుకు రాష్ట్రంలో ఎంపికైన అధికారిగా ఢిల్లీ వెళ్లడం జరిగిందని తెలిపారు. ఈ సదస్సులో ఐటీడీపీ, ఐటీడీఏల పనితీరు మెరుగుపరచడం, గిరిజన అభివృద్ధి పథకాల అమలుపై చర్చ జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను ఈ సదస్సులో ప్రస్తావించనున్నట్లు ఎంపీడీవో బాపన్న దొర తెలిపారు.

## ఉపయోగించకుండానే మరమ్మత్తులలో పశువుల నీటి తొట్టెలు






**వై రామవరం, పెన్ పవర్, జూన్ 3 :** వేసవికాలంలో మూగజీవాల దాహార్తి తీర్చడం కోసం నిర్మాణం చేపట్టిన నీటి తొట్టెలు ఉపయోగించకుండానే మరమ్మతులకు గురయ్యాయని స్థానికులు అంటున్నారు.
మండలంలోని కోట పంచాయతీ బుల్లోజుపాలెంలో ఏర్పాటు చేసిన పశువుల నీటితోట్టె లో నీరు నిలబడకుండానే లీకైపోతుందని ఆ గ్రామస్తులు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో నిర్మించిన నీటి తొట్టెలు ఉపయోగించకుండానే మరమ్మత్తుల గురవడం తో నాణ్యత ప్రమాణాలు పై పలు అనుమానాలు వస్తున్నాయని గ్రామస్తులు అంటున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని ఉపయోగించి మండలంలో నీటి తొట్టెల నిర్మాణం చేపట్టారని తెలిపారు. కే. ఎర్రగొండ పంచాయతీ పెదఊలెంపాడు గ్రామంలో నిర్మించిన నీటి తొట్టకు మరమ్మతులు చేసినా నా నీరు నింపలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో పశువులు నీటి తోట్టె లకు మరమ్మత్తులు చేయించి మూగజీవాల దాహార్తిని తీర్చుటకు నీటితో నింపవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయానికి అంతర్జాతీయ అవార్డు

జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ బి. తాతారావు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 3 :**ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం ప్రతిష్టాత్మక అంతర్జాతీయ “ఫుడ్ ప్లానెట్ ప్రైజ్--2026” పురస్కారాన్ని అందుకోవడం పట్ల జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) బి. తాతారావు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమానికి మరోసారి ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

స్వీడన్‌కు చెందిన కర్ట్ బర్గ్‌ఫోర్స్ ఫౌండేషన్ పర్యావరణ పరిరక్షణ, సుస్థిర ఆహార వ్యవస్థల అభివృద్ధి కోసం అందించే “ఫుడ్ ప్లానెట్ ప్రైజ్” ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మక పర్యావరణ పురస్కారాలలో ఒకటిగా గుర్తింపు పొందిందన్నారు. ఈ అవార్డు రాష్ట్రానికే కాకుండా దేశానికీ విశేష గౌరవాన్ని తీసుకువ చ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, రైతు సాధికార సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు డా. టి. విజయ్‌కుమార్‌లకు అభినందనలు తెలిపారు.

జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని విజయవంతంగా అమలు చేయడం కోసం జిల్లా కలెక్టర్ ప్రోత్సాహం అందించే క్రమంలో క్షేత్ర స్థాయిలో అవగాహన చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో మహిళా రైతులు, రైతు కుటుంబాలు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు, క్షేత్రస్థాయి సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతుల ఉత్పత్తి వ్యయాలు తగ్గడంతో పాటు ఆదాయం పెరుగుతుందని, భూమి సారవంతత, జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ ప్రజల ఆరోగ్యం మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డు జిల్లాలో మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయడానికి ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి లభించిన ఈ అంతర్జాతీయ గుర్తింపు రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని, ప్రకృతి వ్యవసాయ ఉద్యమాన్ని మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లేందుకు ఇది దోహదపడుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ బి. తాతారావు పేర్కొన్నారు.

# శ్రీ కన్నమాంబ జాతర మహోత్సవంలో శాసనసభ్యులు గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 3:** రూరల్ నియోజకవర్గం లోని స్థానిక ఆల్కట్ గార్డెన్స్ లో వేయించేసి ఉన్న శ్రీ కన్నమాంబ పేరంటాలమ్మ తల్లి ఆలయం లో జాతర మహోత్సవం పురస్కరించుకుని శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాతరలో రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించిన రూరల్ శాసనసభ్యులు బుచ్చయ్య చౌదరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల తోపాటు స్థానిక నాయకులు చిట్టి బోయిన శ్రీనివాస్, కక్కల రమేష్, శీలం గోవింద్, దల్లి అప్పల రెడ్డి, పాలిక వెంకట రమణ, కేతా అప్పారావు, కోట శ్రీను, చుక్క శ్రీను, బొంతు ప్రసాద్, పీత వంశీ, పిలక వెంకటరమణ, కడవల అప్పారావు తదితరులు ఉన్నారు.

## అగ్నిప్రమాదం బాధితునికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి ఆర్థిక సహాయం



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, జూన్ 3:** స్థానిక 49వ డివిజన్ సింహాచలం నగర్‌లో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదానికి గురై నష్టపోయిన కుటుంబాన్ని పరామర్శించారు. తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ. 10,000 ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సామాజిక సేవా సంస్థలు కూడా బాధిత కుటుంబానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సింహాచలం నగర్‌లోని డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డివిజన్ ఇంఛార్జి దుత్తరపు గంగాధర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

# కూలిన చెట్ల ను తొలగిస్తున్న మాజీ కార్పొరేటర్ గొర్రెల

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ జూన్ 3**



నగరం లో బుధవారం రాత్రి అకాలంగా వచ్చిన పెనుగాలి , వర్షం కారణంగా స్థానిక 12 వార్డులో పలుచోట్ల నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలునేల కొరిగాయి . చిన్న సోమాలమ్మ గుడి సెంటర్, కృష్ణ కంటి ఆసుపత్రి , పోస్టల్ కాలనీ ,స్వామి ఆసుపత్రి , శ్యామలాంబ పార్క్ పక్క రోడ్స్ పలుచోట్ల చెట్లు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి . మాజీ కార్పొరేటర్ గొర్రెల సురేష్ స్థానిక ప్రజలు పరిశీలించి కార్పొరేషన్ సిబ్బందితో మాట్లాడి సమస్యను పరిష్కరించడంతో స్థానికులు మాజీ కార్పొరేటర్ గొర్రెల సురేష్ ను అభినందించారు.


02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


## సేవలకు నోచుకోక.. గ్రామానికి దూరంగా ప్రభుత్వ భవనాలు



**సీతానగరం, పెన్ పవర్, జూన్ 03:**ప్రజలకు క్షేత్రస్థాయిలో సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలు వృధాగా ఉన్నాయి. లక్షలాది రూపాయల వ్యయంతో చేపట్టిన నిర్మాణాలు గ్రామానికి దూరంగా ఉండి ప్రజాధనం వృధా అయ్యిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో హెల్త్ క్లినిక్లు రైతు భరోసా కేంద్రాల పేరుతో గ్రామాలకు దూరంగా భవనాలను నిర్మించారు. అయితే మండలంలోని 19 రైతు సేవా కేంద్రాలు ఉండగా నేటికీ వీటిని కొన్ని వినియోగించక పోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. రఘుదేవపురం, ఉండేశ్వరపురం, చీపురుపల్లి నాగంపల్లి, సింగవరం, పురుషోత్తపట్నం, తదితర గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్ లు రైతు సేవా కేంద్రాలు గ్రామానికి దూరంగా ఉండడంతో ఆయా శాఖల సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఇష్టపడక గ్రామాల్లోని పాత ప్రభుత్వ భవనాలు ప్రైవేటు భవనాల్లో గ్రామ సచివాలయాల్లో సేవలు అందిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవనాలను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు రైతులు కోరుతున్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారం వేగంగా జరగాలి :ఎమ్మెల్యే బొలిశెట్టి






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 03:**ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పి.జి.ఆర్.ఎస్)లో వచ్చే సమస్య లను వేగంగా పరిష్కారించాలని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం, పెంటపాడు మండల ప్రజా పరిషత్తు సర్వ సభ్య సమావేశం బుధవారం జరిగింది. మండల పరిషత్తు అధ్యక్షురాలు కట్టుబోయిన వేంకట లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్లు, పట్టాదారు పాస్ బుక్కులు, వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని అన్నారు. కొత్త పింఛన్లు, ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే కార్యక్రమం త్వరలోనే ప్రారంభమవుతుందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చే విధంగా కూటమి ప్రభుత్వం సమర్ధవంతంగా పనిచేస్తుందని అన్నారు.ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ఆశయాలను నెరవేర్చే విధంగా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలని అన్నారు. కుటుంబ సర్వేలో జనాభా తగ్గడానికి గల కారణాలను లోతుగా అధ్యయనం చేయాలని కోరారు. త్వరలో జరగనున్న ఓటర్ల జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు శ్రద్ధగా నిర్వహించాలన్నారు. అనర్హుల ఓట్లు తొలగించటం, అర్హులఓట్లు కాపాడటం ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశ్యమని అన్నారు. ఈ బృహత్తర కార్యక్రమం సమగ్రంగా జరగటానికి ఖచ్చితమైన సమాచారాన్ని అందించి ప్రజలు సహకరించాలని కోరారు.ఈ సమావేశం లో తహసీల్దార్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వేటమామిడిలో వాహన తనిఖీలు..



**అడ్డతీగల ,పెన్ పవర్, జూన్03:**అడ్డతీగల మండలం వేటమామిడి జంక్షన్లో బుధవారం సాయంత్రం పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. అడ్డతీగల సిఐ ఎం.గజేంద్ర కుమార్, ఎస్సై బి. వినోద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో ప్రధానంగా వాహన పత్రాలు, హెల్మెట్ మరియు నిబంధనల ఉల్లంఘనలపై దృష్టి సారించారు. ఈ తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని 9 వాహనాలపై కేసులు నమోదు చేసి, మొత్తం 10,000 రూపాయల అపరాధ రుసుము విధించినట్లు ఎస్సై వినోద్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

## జర్నలిస్టులు హెల్త్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

ఇంచార్జ్ డీపీఆర్వో లక్ష్మణాచార్యులు

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 3:**వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను 2026--27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిన నేపథ్యంలో అర్హులైన జర్నలిస్టులు హెల్త్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఇంచార్జ్ డీపీఆర్వో లక్ష్మణాచార్యులు తెలిపారు.వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జారీ చేసిన జీవో ఎంఎస్ నెం.43 (తేదీ: 10-04-2026) ప్రకారం డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ పథకం అమలవుతుందని పేర్కొన్నారు. ఈ పథకంలో జర్నలిస్టు వాటాగా రూ.1,250ను సీఎఫ్ఎంఎస్ పోర్టల్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మొత్తం ప్రీమియం రూ.2,500 కాగా, మిగిలిన రూ.1,250ను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని వివరించారు.ఈ పథకం కింద జర్నలిస్టులతో పాటు వారి జీవిత భాగస్వామి, పిల్లలు, ఆధారిత తల్లిదండ్రులకు నగదు రహిత వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సంవత్సరానికి రూ.2 లక్షల వరకు వైద్య సేవలతో పాటు నిర్దేశిత చికిత్సలకు ఉచిత బాహ్య రోగుల సేవలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. పోలవరం జిల్లా పరిధిలో అక్రిడిటేషన్ కలిగిన వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

**పత్రాల సమర్పణ వివరాలు.**

హెల్త్ కార్డుల పునరుద్ధరణ కోసం ప్రీమియం చెల్లించిన అసలు చలానా, నూతన అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్ ప్రతితో పాటు పాత హెల్త్ కార్డులను సమర్పించాల్సి ఉంటుంది.కొత్త హెల్త్ కార్డుల కోసం ప్రీమియం చెల్లించిన అసలు చలానా, నూతన అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్ ప్రతి, జర్నలిస్టు మరియు కుటుంబ సభ్యుల హెల్త్ కార్డులు, జర్నలిస్టు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, అవసరమైన ఇతర ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. రైస్ కార్డు, ఈపీఎఫ్‌వో కార్డు జిరాక్స్ ప్రతులు కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి మాత్రమే అవసరమని తెలిపారు.అన్ని పత్రాలను జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ పోలవరం కార్యాలయంలో కార్యాలయ పనిదినాల్లో సమర్పించాలని ఇంచార్జ్ డీపీఆర్వో లక్ష్మణాచార్యులు కోరారు.

# డ్రైనేజీ లో చెత్త తొలగించండి



**జీలుగుమిల్లి ,పెన్ పవర్ ,జూన్ 3 ;** డ్రైనేజీలో చెత్త పేరుకుపోయి మురుగునీరు నిల్వ ఉండి ఇంటిలోకి వస్తుందని సిరి రామకృష్ణ ఇబ్బందులకు గురవుతున్నాడు. ఇంటిలోనే పొగాకుబేళ్లు, వస్తువులు తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలోని ఈ దుస్థితి నెలకొని ఉంది. బాధితుడు పంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. డ్రైనేజీ లోని చెత్తను తొలగించి మురుగునీరు నిల్వ ఉండకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైంది: వడ్డి రఘురామ్ నాయుడు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 03:**కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, రెండేళ్ల పాలన అంతా ఘోరంగా ఉందని అన్నారు తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" పోస్టర్ వడ్డి రఘురామ్ నాయుడు వైసీపీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ అని రుజువయ్యిందని ఆయన పేర్కొన్నారు. 'వెన్నుపోటుకు, విధ్వంసానికి, అరాచకానికి, అబద్ధాలకు, డైవర్షన్ రాజకీయాలకు, అవినీతికి, దోపిడీ రెండేళ్ల చంద్రబాబు పాలన ప్రతిరూపం' అని ధ్వజమెత్తారు. ఈ నిరసన కార్యక్రమాలలో భాగంగా, జూన్ 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళు ' అనే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలతో చంద్రబాబుకు నిరసన సెగ తగుల్తోందని అన్నారు. ఎన్నికల్లో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రాంగణం లో 5 న భారీ రైతు సదస్సు







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 03:**జూన్ 5 తేదీ, శుక్రవారం ఉదయం 10 గంటలనుండి , వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరగనున్న" రైతు సదస్సు" కు పెద్ద ఎత్తున రైతులు హాజరై, నూతన సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన పెంచుకోవాలని , ఉపకులపతి డా కె. ధనుంజయరావు తెలియజేశారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్ లో డా. కె. ధనుంజయరావు పాల్గొని, రైతు సదస్సు ఏర్పాట్లు, ప్రాధాన్యత అంశాలు గురించి వివరంగా తెలియచేశారు.

సాంప్రదాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న రైతులకు నూతనంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతకు మధ్య దూరాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో "రైతు సదస్సు" ఏర్పాటు చేయడమైనది అని, ఇక్కడ 100కు పైగా కంపెనీలు తమ స్టాల్స్ ని ఏర్పాటు చేసి వారు అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని యంత్రాలను ప్రదర్శనకు ఉంచుతారు, పనితీరు వివరిస్తారు. ఉద్యాన విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన వివిధ రకాల వంగడాలు వాటి ప్రయోజనాలు తెలియజేస్తారు మరియు కూరగాయలు పండ్ల తోటల ప్రదర్శన క్షేత్రాలు సిద్ధం చేసి ఉంటాయి. రక్షిత సాగు పద్ధతులలో అభివృద్ధి చేసిన టమాటా, వంగ నార్లు రైతులకు అందజేస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉద్యాన పంటలకు అత్యంత అనుకూలమైన వాతావరణ పరిస్థితులు కలిగి ఉన్నప్పటికీ, వర్షాభావ పరిస్థితులు కారణంగా రాయలసీమ ప్రాంతాల్లో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు, రైతు కష్టాలు తొలగిపోయి రైతులు అధిక ఆదాయం సంపాదించుకోవాలని లక్ష్యంతో రాయలసీమ ప్రాంతాన్ని "హార్టికల్చర్ హబ్ " గా ప్రకటించి, అందుకు మద్దతు గా 30 వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఇది దేశ చరిత్రలోనే ఉద్యాన రైతుల పక్షంగా ఒక రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న గొప్ప నిర్ణయం అని ఉపకులపతి ప్రస్తుతించారు. డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, సంబంధిత శాఖల సమన్వయంతో ముఖ్యభూమికను పోషించాల్సి ఉంది. అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో పనిచేస్తుంది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు కింజరపు అచ్చెనాయుడు గారి అనుమతితో జూన్ నెల 5వ తేదీ, పశ్చిమగోదావరి జిల్లా వెంకటరామన్న గూడెం లోని డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రాంగణంలో రైతు సదస్సు ఏర్పాటు చేయడమైనది. ఈ రైతు సదస్సుకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు మరియు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రివర్యులు, శాసనమండలి చైర్మన్, ఏలూరు , పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు సంబంధిత శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొంటారు.

సభాధ్యక్షులుగా తాడేపల్లిగూడెం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ వ్యవహరిస్తారు. ఇది రైతు కార్యక్రమం, రైతుల కోసం ఏర్పాటు చేయబడిన కార్యక్రమం కనుక పెద్ద సంఖ్యలో రైతులు, రైతు నాయకులు, ఉద్యాన రంగానికి చెందిన నిపుణులు మహిళలు పెద్ద ఎత్తున హాజరుకావాలని సగౌరవంగా ఆహ్వానిస్తున్నాను. అని ఉప కులపతి డా కె ధనుంజయరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. మాధవి, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డా.సీఎహ్. రూత్ పాల్గొన్నారు.

## ఎం.ఆర్.పి.ఎస్.ముఖ్యకార్యకర్తల సమావేశం



**వి.ఆర్. పురం పెన్.పవర్.జూన్.3:**మండలంలోని వి.ఆర్.పురం బి.సి.ఎస్.సి.కాలనీ, గ్రామంలోఎం.ఆర్.పి.ఎస్.ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈసమావేశానికి, ఎం.ఆర్.పి. ఎస్.జాతీయనాయకులు,చిన్న సుబ్బారావు ముఖ్య అతిథులుగా పాల్గొని,మాట్లాడుతూ విద్య,సామాజిక చైతన్యం,మాదిగ జాతి అభ్యున్నతి,కోసంప్రతిగ్రామం లోప్రజలను చైతన్యవంతంగా చేయాలని పిలుపుని చ్చారు.సంస్థ విస్తరణలో భాగంగా కొత్త కమిటీలను ఏర్పాటు చేసి,పలువురు కార్యకర్తలకు నూతన పద వులు,బాధ్యతలు అప్పగించారు.గ్రామస్థాయిలోసంస్థ నుమరింత బలోపేతంచేసి యువత,మహిళలను సంస్థ కార్యక్రమాల్లోభాగస్వామ్యం చేయడానికి చర్యలు తీసు కుంటున్నట్లువెల్లడించారు.మేనెల25,నుండిజూ లైనెల5,వరకునిర్వహిస్తున్న,40రోజులలో పల్లెకు వెల్దాం?కార్యక్ర మంలోలక్ష్యాలను,ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పిలుపు నిచ్చా రు.అనంతరం ఈ సమావేశంలో నాయకులు మాట్లాడు తూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులను,ఉన్నత విద్యవైపు, ప్రోత్సహించడం,మాదిగ హక్కులసాధన కోసం పోరాటాన్ని బలోపేతం చేయడం,ఎంఆర్పీఎస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి, తీసుకెళ్లాలని,కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి, జిల్లా ఎంఆర్పీఎస్ అధ్యక్షులు మోర్తా బుజ్జిబాబు,జిల్లా ఉపాధ్య క్షులు వేమగిరి అర్జున్,జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వెంకన్న బాబు,ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు బింగి విష్ణుమూ ర్తి,మండల ఎంఎస్పి అధ్యక్షులు గడ్డంకృపారావు,ఎంఎం ఎస్.అధ్యక్షురాలు ములకలపల్లి సరోజిని,నియోజకవర్గ కో-కన్వీనర్,మోదుగునాగేశ్వరరావు,జిల్లా కో-కన్వీనర్, గడ్డంసుధాకర్,మండలం ఎమ్మార్పీఎస్,అధ్యక్షులు తుంగ కుమార్,ముయ్యేటినాగమణి,గడ్డంకుసుమ,విలీ న మండ లాలైన కూనవరం మండలం ఎంఎస్పి జిల్లాఅధికార ప్రతి నిధులు,గడ్డంవెంకటేశ్వర్లు,గడ్డంబాబురావు,తది తరులు పాల్గొన్నారు.

## అడ్డతీగల గురుకుల పాఠశాలలో 'గోబర్ధన్' ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన..



**అడ్డతీగల, పెన్ పవర్, జూన్ 03:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "గోబర్ధన్" పథకం కింద బయో-గ్యాస్ (జీవ ఇంధన) ప్లాంట్ ఏర్పాటు చేయడానికి అడ్డతీగల మండల కేంద్రంలోని ఏ.పీ.ఆర్.ఎస్. బాలుర ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణను బుధవారం నిపుణుల బృందం సందర్శించింది.

కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సి ఎస్ ఐ ఆర్) శాస్త్రవేత్తల బృందం సభ్యులు రాయల మోహన్, జి. సుమంత్ మరియు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ జిల్లా కన్సల్టెంట్ వి. అర్జున కలిసి ఈ ఉమ్మడి తనిఖీని నిర్వహించారు.

ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ, గురుకుల పాఠశాల వంటశాల నుండి ప్రతిరోజూ వచ్చే తడి వ్యర్థాలు మరియు ఆహార వ్యర్థాలను ఉపయోగించి ఈ బయో-గ్యాస్ ప్లాంట్‌ను నిర్మించడానికి గల సాధ్యసాధ్యాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే గ్యాస్‌ను పాఠశాల వంటశాల అవసరాలకు (ఎల్ పి జి కి ప్రత్యామ్నాయంగా) వాడుకోవచ్చని, తద్వారా ప్రభుత్వానికి ఇంధన ఖర్చులు తగ్గడమే కాకుండా పాఠశాల ఆవరణలో పారిశుధ్యం మెరుగుపడుతుందని వివరించారు. అలాగే ప్లాంట్ నుండి వచ్చే బై-ప్రొడక్ట్ ను తోటలకు సేంద్రీయ ఎరువుగా వాడుకోవచ్చన్నారు.

ఈ తనిఖీకి సంబంధించిన నివేదికను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు సమర్పించి, త్వరలోనే ప్లాంట్ మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మరియు స్థానిక సచివాలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పీహెచ్ సీని తనిఖీ చేసిన డిఎం అండ్ హెచ్ ఓ



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, జూన్ 3 ;** గర్భిణీలు, బాలింతలకు ఇచ్చే వ్యాక్సిజన్ సక్రమంగా వేయాలని ఏలూరు జిల్లా డిఎంహెచ్వో యు శోభ సూచించారు. బుధవారం జీలుగుమిల్లి పిహెచ్సి ని ఆమె తనిఖీ చేశారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన బాలికలకు గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ ఇంజక్షన్ ను తప్పకుండా వేయించుకునేలా చూడాలని సూచించారు. అనంతరం రోగులతో మాట్లాడి ఆసుపత్రి వైద్య సేవలు పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈమెతోపాటు డిప్యూటీ డిఎంహెచ్వో జె సురేష్, వైద్యులు మణికంత ,పవన్ కుమార్, ఫార్మసిస్ట్ నాగేశ్వరరావు ,ఎల్టి మంగ, సిబ్బంది కు రం ప్రసాదు ఉన్నారు.

## జలధార పనులను వేగవంతం చేయండి అధికారులకు ఎంపీడీవో ఆదేశాలు..



**అడ్డతీగల, పెన్ పవర్, జూన్ 03:**వికసిత భారత గ్యారంటీ ఫర్ రోజు గర్ అండ్ అజీవ్ క మిషన్( గ్రామీణ వి బి జి రామ్ జి ) మండలంలో 22 గ్రామపంచాయితీ ల లో జిల్లా కలెక్టర్ కొత్తగా శాంక్షన్ ఇచ్చిన 139 జలధార పనులను ప్రారంభించాలని మరియు నాణ్యత ప్రమాణాలు ప్రకారం పనిచేయించాలని వి బి జి రామ్ జి సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లతో సమావేశం ఏర్పాటుచేసి సమీక్ష నిర్వహించారు. జలధార పనులు పూర్తి అయ్యాక మాత్రమే ఇతరపనులు చేయాలని జూన్ 30 లోపు అన్ని పూర్తి చేయాలని, ఏఈఈ ఆర్డబ్ల్యూ ఎస్ వి.చందు మరియు ఏపీవో బి. చిరంజీవి వారి సిబ్బందికి ఎంపీడీవో కుమార్ ఆదేశాలు జారీ చేశారు

## రాళ్లకుంటలో పెన్షన్ తీసుకోవాలంటే సచివాలయానికి రావాల్సిందే..!



**ఏలూరు జూన్ 3 పెన్ పవర్ :** కూటమి ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలలో పెన్షన్ పథకం ఒకటి. ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా,పాలక పగ్గాలు చేపట్టిన నాటి నుండి ప్రతి నెలా 1వ తేదీన పేదల ఇళ్లకు వెళి, ల సచివాలయం సిబ్బంది పెన్షన్‌లు అందజేయాలని,ఆదిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది.నిభందనల ప్రకారం లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్ అందజేయాల్సిఉన్నా వారు లబ్ధిదారులను సచివాలయానికి రప్పించుకుంటున్నారు.ద్వారకా తిరుమల మండలంలో పలు గ్రామ పంచాయితీల పరిధిలోకి శివారు గ్రామాల ప్రజలు క్షేత్ర స్దాయిలో అర్హులైన లబ్ధిదారలకు పెన్షన్ తీసుకోవాలంటే సచివాలయానికి వెళ్లాల్సిన పరిస్దితి ప్రతి నెల ఏర్పడుతోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాళ్లకుంట సచివాలయం పరిధిలోసత్తేన గుంట కాలనీ ఉంది.ఆ కాలనీ రాళ్లకుంట సచివాలయానికి 3కి.మీ.దూరం లో ఉంది.అక్కడి నుండి నడిచి వెళ్లి శివారు గ్రామ అబ్ధిదారులు,కొంత మంది ఉపాధి కార్మికులు రాళ్లకుంట సచివాలయంలో సాయంత్రం వరకు నిరీక్షించాల్సిన పరిస్దితి ప్రతి నెలఏర్పడుతోందని, సచివాలయ సిబ్బంది తమ ఇళ్లవద్దనే పెన్షన్‌లు అందజేసే విధంగా మండల అధికారులను చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

## త్రాగునీరు సమస్యను పరిష్కరించిన,ఎమ్మెల్యే

-ఎమ్మెల్యేకు,కృతజ్ఞతలుతెలిపిన,చొప్పల్లి,గ్రామస్తులు



**వి.ఆర్.పురం పెన్.పవర్.జూన్.3:**మండలంలోని చొప్పల్లి,గ్రామప్రజలకు కొంతమేరకు త్రాగునీరు,అందకపోవడంతో,నీటిసమస్యతో,నానా ఇబ్బందులు పడుతు న్నారు.పంచాయితీలలో సర్పం చులపదవి కాలంము గియడంతో,తమకున్నత్రాగునీరు సమస్యనుగ్రామస్తులు టిడిపిపార్టీమండలఅధ్యక్షులు బొర్రానరేష్,కుమార్,ద్వారా రంపచోడవరం నియోజకవర్గంఎమ్మెల్యేమిరియాల శిరీష,దేవి, కు,తెలియజేయగా ఎమ్మెల్యే,తక్షణమే స్పందించి, సంబంధితఅధికారులతో,మాట్లాడి,ఆసమస్యను పరిష్కరించారు.చొప్పల్లి,గ్రామప్రజలు,రంపచోడవరం నియోజకవర్గంఎమ్మెల్యే మిరి యాల శిరీష,దేవి,కుటిడిపి పార్టీ మండలఅధ్యక్షులు బొర్రానరేష్,కుమార్,కు కృత జ్ఞతలుతెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఐటిడిపి కన్వీనర్,ఆకోజుభాగ్యలక్ష్మి,మాజీ ఎంపీటీసీ ఉర్మఆదమ్మ ,సీనియర్,నాయకులు బోదె బోయిన సురేష్,రావు,బొర్రా సూరిబాబు,మిడియం వీరయ్య,ఉర్మసీతారామయ్య, ఊర్మబుచ్చ య్య,కారంచి రంజీవి,నీలంరాజా,జంగాల ప్రేమ్,సాగర్,కారంసత్యం,ధర్మలబాబు, కారంలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## పెట్రో ధరల పెంపు నిరసిస్తూ వామపక్షాలు ప్రదర్శన

మెయిన్ రోడ్ లో కరపత్రాలు పంపిణీ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 3:** మోడీ పాలనలో విద్యార్థులు, యువజనులు అన్ని వర్గాల ప్రజలు అన్ని రకాలుగా నష్టపోతున్నారని వచ్చే ఎన్నికల్లో ప్రజల గుణపాఠం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు హెచ్చరించారు. పెట్రోల్ ధరలను నిరసిస్తూ బుధవారం స్థానిక కోటగుమ్మం సెంటర్ నుండి మసీదు వరకు ర్యాలీ నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. తాటిపాక మధు మాట్లాడుతూ,
సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి విజయన్ నివాసంలో ఈడీ రాజకీయ దాడిని వామపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.
కేంద్ర సంస్థలను ఉపయోగించి చేసే వేధింపులు వామపక్షల గొంతు నొక్క లేరన్నారు.
పెట్రోల్, గ్యాస్ భారం కేంద్ర నిరంకుశ విధానాలపై
జూన్ 9న రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహిస్తామని అన్నారు.సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి పవన్ మాట్లాడుతూ కేజీ బేసిన్ గ్యాస్ సాధన కోసం పాశర్లపూడిలో వామపక్షాలు జూన్ మొదటివారంలో పర్యటిస్తాయన్నారు. కేంద్రం పెట్రోలు ధరలను పెంచుతోందని, రోజువారీ కూలీలు, చిన్న ఉద్యోగులు, తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె రాంబాబు మాట్లాడుతూ ప్రజలపై పడుతున్న భారాలను తగ్గించేందుకు పెట్రోలు, డీజిల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు తగ్గించాలని కోరారు. కేజి బేసిన్ నుండి ఉత్పత్తి అయ్యే చమురు, గ్యాస్‌లో 50 శాతం రాష్ట్రానికి కేటాయించాలని కోరారు.
సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఎస్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ
కేరళం మాజీ సిఎం పినరయి విజయన్‌పై దాడి వెనుక కేంద్రం కుట్ర ఉందని వెల్లడించారు.
ఈ కార్యక్రమలో సీపీఐ నగర కార్యదర్శి వి కొండలరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లం వెంకటేశ్వరావు, పి లావణ్య, నల్ల రామారావు టీ నాగేశ్వరావు కాకి శారద, దేముడు బాబు సీపీఎం నాయకులు ఎస్ ఎస్ మూర్తి, జువ్వల రాంబాబు, పూర్ణిమ రాజు
సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఎన్. సతీష్ రమణ తదితరులు పాల్గొన్నారు

## ఓటరుజాబితాసవరణ ప్రక్రియపై అవగాహన సమావేశం

* నాలుగుమండలాల వై.సి.పి.పార్టీ నాయకులు,కార్యకర్తలు





**వి.ఆర్.పురం పెన్.పవర్.జూన్.3:**మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు,గృహములోబుధవారం చింతూరు, ఎటపాక,కూనవరం,వి.ఆర్.పురం మండలాలకు చెందిన ముఖ్యనాయకులు,బూత్ స్థాయి ప్రతినిధులకు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై అవగాహన సమావేశం నిర్వహించడంజరిగింది.ఈ సమావేశానికి రంపచోడవరం మాజీ శాసనసభ్యురాలు నాగులపల్లి ధనలక్ష్మి,ప్రత్యేక సవరణ ప్రక్రియ ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్,వాముశెట్టి పర మేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని,మాట్లాడు తూ,బూత్ స్థాయి ప్రతినిధులకు ఓటరు జాబితా నిర్వ హణ,కొత్త ఓటర్ల నమోదు,అభ్యంతరాల దర ఖాస్తులు, వివరాల సవరణలు, గృహ గణన ప్రక్రియలపై సమగ్ర అవగాహన కల్పించినట్లు తెలిపారు.అలాగే నకిలీ ఓట్ల తొలగింపు కార్యక్రమంలో బూత్ స్థాయి ప్రతినిధులు చురుకుగా వ్యవహరించాలని, ఒకే వ్యక్తి పేరుపై ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో నమోదైన ఓట్లను గుర్తించి, ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైందని,విమర్శించారు.ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని,రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి నాయకులు,కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు,చింతూరు జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడు,కూనవరం మండల ప్రజా పరిషత్, అధ్యక్షులు,జిల్లా కమిటీ సభ్యులు,మాజీ సర్పంచులు, మండల ప్రాదేశిక సభ్యులు,వివిధ హోదాల్లోఉన్న నాయ కులు,అనుబంధ సంఘాల ప్రతినిధులు,కార్యకర్తలు తది తరులు పాల్గొన్నారు.

## రాజు గారి చెరువు ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు

మాజీ సర్పంచ్ కుంజం లక్ష్మి ఆరోపణ

**గంగవరం, పెన్ పవర్, జూన్ 3:**మండలంలోని మొల్లేరు పంచాయతీలో గల రాజు గారి చెరువు ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని మాజీ సర్పంచ్ కుంజం లక్ష్మీ ఆరోపించారు. రాజుగారి చెరువు పనులకు పంచాయతీలో ఎటువంటి తీర్మానం లేకుండా పనులు చేపట్టినట్లుగా సుమారు 7 లక్షల 50 వేల రూపాయలు నిధులు కాజేశారని ఆమె ఆరోపించారు. చెరువు వద్ద ఎటువంటి పనులు చేపట్టకుండా పనులు పూర్తి చేసినట్లుగా చూపించి నిధులు కాజేశారని ఈ పనిపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రాజుగారి చెరువు పనుల అవకతవకలపై జిల్లా కలెక్టర్కు ,ఎంపీడీవోకు ఫిర్యాదు చేయడం జరిగిందని ఆమె తెలిపారు.

## 10వ డివిజన్ లో రూ.73 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

* రెండేళ్లలో రూ.11 కోట్ల అభివృద్ధి పనులు
* ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 3:**నగర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, 10వ డివిజన్‌లో ఇప్పటికే రూ.11 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. 10వ డివిజన్ పరిధిలోని ఏపీఎస్ఈబీ ఫంక్షన్ హాల్ నుంచి వీఎల్ పురం జంక్షన్ వరకు రూ.73 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే సుమారు రూ.4 కోట్ల విలువైన 25 అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మరో రూ.2 కోట్ల పనులు ప్రారంభ దశలో, రూ.4 కోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. రూ.1 కోటి విలువైన పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయన్నారు.

**52 కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్...**

ఈ ప్రాంతంలో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం "ఖేలో ఇండియా" పథకం కింద రెండో దశ పనులకు రూ.13 కోట్ల నిధులు మంజూరు అయన్నారు. తొలి దశలో రూ.28 కోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయన్నారు. మూడో దశ రూ.11 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు ఎంపీపురంధే శ్వరి కృషి చేస్తున్నారన్నారు. మూడు దశల్లో రూ.52 కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించి యువతకు అంకితం చేస్తామన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రత్యేక శిక్షణా కేంద్రం కోసం అర ఎకరం స్థలం కోరారన్నారు. నగరానికి భవిష్యత్తులో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో ఎమ్మెల్యేలు ఎంపీలు, జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఘనంగా గంగాలమ్మ జాతర





**గంగవరం, పెన్ పవర్, జూన్ 3:**మండల కేంద్రమైన గంగవరం లో గంగాలమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక బాపనమ్మ తల్లి ఆలయం వద్ద గ్రామస్తులు గంగాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజన సాంప్రదాయ లను అనుసరించి గంగాలమ్మ జాతర నిర్వహించారు. సంప్రదాయ నృత్యాలు అయిన కోలాటం దింసా నృత్యాలను నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## గంగవరంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**గంగవరం, పెన్ పవర్, జూన్ 3:**స్థానిక అంగన్వాడీ కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ కే కుమారి అధ్యక్షతన జరిగిన వేడుకలలో ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించే విధంగా రికార్డ్ షీట్లను అందజేశారు. అలాగే ప్రీ స్కూల్లో విద్యార్థులు నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రుల సమక్షంలో వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎం లక్ష్మీ సుజాత, కటాక్షం వైద్య సిబ్బంది రామయ్యమ్మ ,నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## లారీకి అగ్నిప్రమాదం





**చింతూరు, పెన్ పవర్, జూన్ 03:**తులసిపాక గ్రామ సమీపంలో ఈ రోజు ప్రమాదవశాత్తూ మొక్కల లోడుతో వెళ్తున్న లారీకి అగ్నిప్రమాదం సంభవించింది. లారీ నెంబర్ సీజీ 18 ఎస్ 8034 కడియం, రాజమండ్రి నుండి మొక్కల లోడుతో ఛత్తీస్‌గఢ్ వైపు ప్రయాణిస్తుండగా, వెనుక టైరు ఒక్కసారిగా పేలిపోయింది. తీవ్ర ఎండల కారణంగా మంటలు చెలరేగి లారీ వెనుక భాగానికి వేగంగా వ్యాపించాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు వెంటనే మోతుగూడెం పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం మేరకు తెలిసింది. ఈ ఘటనపై మోతుగూడెం ఎస్ఐ అబ్దుల్ నస్సిర్ హుసైన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు దర్యాప్తులో వెల్లడికానున్నాయని పోలీసులు తెలిపారు.

## నాలుగు కిలోల గంజాయితో ముగ్గురు అరెస్ట్

వాహన తనిఖీల్లో పట్టుబడ్డ నిందితులు స్కూటీ, మొబైల్ ఫోన్లు స్వాధీనం




**చింతూరు, పెన్ పవర్, జూన్ 03:**పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో నాలుగు కిలోల గంజాయితో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. చింతూరు ఎస్ఐ ఎం. సంతోష్ కుమార్‌కు అక్రమ గంజాయి రవాణాకు సంబంధించి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు మోట్ సెంటర్ వద్ద ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్రం నుండి చింతూరు మీదుగా హైదరాబాద్‌కు వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను అనుమానాస్పదంగా గుర్తించి తనిఖీ చేయగా, వారి వద్ద నాలుగు కిలోల గంజాయి లభ్యమైంది. పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అలాగే నిందితుల వద్ద నుండి నాలుగు మొబైల్ ఫోన్లు, ఒక హోండా యాక్టివా స్కూటీని సీజ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు చింతూరు ఎస్ఐ ఎం. సంతోష్ కుమార్ తెలిపారు.

# బ్యాడ్మింటన్ ఫ్యాన్స్‌కు షాక్.. ఇండోనేషియా ఓపెన్ నుండి సాత్విక్-చిరాగ్ అవుట్!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ బ్యాడ్మింటన్ సూపర్‌స్టార్స్ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి ఫ్యాన్స్‌కు ఒక బ్యాడ్ న్యూస్.. ప్రస్తుతం జరుగుతున్న ప్రతిష్టాత్మక ఇండోనేషియా ఓపెన్ 2026 (రాబజూవతీ 1000) టోర్నమెంట్ మొదటి రౌండ్ నుంచే ఈ వరల్డ్ నంబర్ 4 జంట తప్పుకుంది. మలేషియాకు చెందిన కాంగ్ ఖై జింగ్, ఆరోన్ తాయ్‌లతో జరుగుతున్న మ్యాచ్‌లో సాత్విక్ కుడి భుజం నొప్పితో ఇబ్బంది పడ్డాడు. దీంతో ఆటను మధ్యలోనే ఆపేసి కోర్టు నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. మ్యాచ్ ఆపే సమయానికి సాత్విక్-చిరాగ్ జోడీ 6--11తో వెనుకంజలో ఉంది.

**బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్లారిటీ:**
సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడి తప్పుకోవడంపై బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఒక అఫీషియల్ స్టేట్‌మెంట్ రిలీజ్ చేసింది. సాత్విక్‌కు గాయం కావడంతో ఇండోనేషియా ఓపెన్ నుంచి తప్పుకుంది.. రాబోయే పెద్ద టోర్నమెంట్ల దృష్ట్యా సాత్విక్ త్వరగా కోలుకోవడానికి, రీహాబిలిటేషన్ పైనే ఇప్పుడు టీమ్ ఫోకస్ పెట్టబోతోంది. సాత్విక్ స్పీడీగా రికవరీ అవ్వాలని కోరుకుంటున్నామని పేర్కొంది.

గత కొన్ని వారాలుగా సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ బ్యాక్-టు-బ్యాక్ మ్యాచ్‌లతో ఫుల్ బిజీగా ఉంది. జస్ట్ కొన్ని రోజుల ముందే థాయ్‌లాండ్ ఓపెన్ ఫైనల్స్ రీచ్ అవ్వడమే కాకుండా, గంటకు పైగా సాగిన హోరాహోరీ పోరులో గెలిచి 'సింగపూర్ ఓపెన్' టైటిల్‌ను కూడా తమ ఖాతాలో వేసుకున్నారు. ఈ ఓవర్‌లోడ్ వల్లే సాత్విక్ భుజంపై ప్రెషర్ పడినట్లు తెలుస్తోంది.

**గాయాలపై సాత్విక్ ఓపెన్ టాక్:**
ఇదే ఏడాది ఢిల్లీలో జరగబోయే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్, అలాగే ఆసియా గేమ్స్ (Asian Games) వంటి మెగా టోర్నీలు ఉండటంతో.. ప్లేయర్స్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ చాలా కీలకంగా మారింది. గాయాల గురించి సాత్విక్ ఇటీవల మాట్లాడుతూ.. ఇంజూరీస్ అనేవి నా ఒక్కడికే కావు, ఎవరి కెరీర్ కూడా 100 శాతం పర్‌ఫెక్ట్‌గా సాగదు.. మనం మన బాడీకి రెస్పెక్ట్ ఇవ్వాలి.. నా స్టైల్ ఆఫ్ ప్లే కొంచెం అటాకింగ్‌గా (Aggressive) ఉంటుంది కాబట్టి అప్పుడప్పుడు ఇలాంటి పెద్ద టోర్నీలు మిస్ అవ్వక తప్పదు.. వాటిని లైట్ తీసుకుని, మెయిన్ టోర్నమెంట్స్ నాటికి పూర్తి ఫిట్‌నెస్ సాధించడంపైనే ఫోకస్ పెట్టాలని సూచించాడు.

**ఇండియన్ ప్లేయర్స్ సీన్ ఏంటి?:**
ఒకవైపు సాత్విక్-చిరాగ్ తప్పుకున్నా.. ఇండియాకు మిక్స్‌డ్ డబుల్స్‌లో గుడ్ న్యూస్ అందింది. రోహన్ కపూర్ - శివాని రుత్విక గద్దె జోడీ చైనీస్ తైపీ ప్లేయర్లపై స్ట్రెయిట్ గేమ్స్‌లో సూపర్ విక్టరీ కొట్టి సెకండ్ రౌండ్‌కు దూసుకెళ్లారు.

ఇక సింగిల్స్ విషయానికి వస్తే.. స్టార్ ప్లేయర్ పీవీ సింధు తన మ్యాచ్ గెలిచి నెక్స్ట్ రౌండ్‌కు క్వాలిఫై అవ్వగా, లక్ష్య సేన్, కిదాంబి శ్రీకాంత్ మొదటి రౌండ్‌లోనే ఓడిపోయి టోర్నీ నుంచి ఎగ్జిట్ అయ్యారు. ఆయుష్ శెట్టి, హెచ్.ఎస్. ప్రణయ్ తమ మ్యాచ్‌లు త్వరలో స్టార్ట్ చేయనున్నారు.

# భారత్ VS పాక్ మ్యాచ్ ఒక్కటే కాదు.. వరల్డ్ కప్‌కి హైప్ ఇవ్వండి.. స్మృతి మంధాన బోల్డ్ కామెంట్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల టీ20 వరల్డ్ కప్ 2026 ప్రారంభానికి ముందు టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన క్రికెట్ ప్రపంచానికి ఒక స్ట్రాంగ్ మెసేజ్ ఇచ్చింది. సాధారణంగా క్రికెట్ టోర్నమెంట్ ఏదైనా సరే.. అందరి ఫోకస్ కేవలం ఇండియా వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్ పైనే ఉంటుంది. కేవలం ఈ ఒక్క మ్యాచ్‌నే కాకుండా టోర్నీ మొత్తాన్ని సమానంగా ప్రమోట్ చేయాలని, వరల్డ్ కప్ మొత్తానికి భారీ హైప్ క్రియేట్ చేయాల్సిన అవసరం ఉందని స్మృతి పిలుపునిచ్చింది.

ఈ రెండు ప్రత్యర్థి జట్ల మధ్య జూలై 14వ తేదీన బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ క్రికెట్ గ్రౌండ్‌లో గ్రూప్-స్టా మ్యాచ్ జరగనుంది. ఈ మెగా పోరుకు సంబంధించిన టికెట్లు అప్పుడే హాట్ కేకుల్లా అమ్ముడైపోయాయి. ఇక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో స్మృతి మంధాన మాట్లాడుతూ.. గతంలో బర్మింగ్‌హామ్‌లోనే జరిగిన కామన్వెల్త్ గేమ్స్ 2022లో మేము పాకిస్తాన్‌తో ఆడినప్పుడు స్టేడియం మొత్తం హౌస్‌ఫుల్ అయ్యింది. కేవలం భారత్-పాక్ మ్యాచ్ మాత్రమే కాదు.. ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ మొత్తాన్ని మనం హైప్ చేయాలి.. ఎందుకంటే ఈ ఒక్క మ్యాచ్‌కు ఎలాగో క్రేజ్ ఉంటుంది.. ఈసారి కూడా మాకు సపోర్ట్ చేయడానికి భారీ సంఖ్యలో అభిమానులు వస్తారని తెలుసు.. ఖచ్చితంగా గ్రౌండ్‌లో అద్భుతమైన పర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను అలరిస్తామని పేర్కొనింది.

**ఫామ్ కోల్పోయిన భారత్.. టెన్షన్‌లో ఫ్యాన్స్:**
గతేడాది (2025) హోమ్ గ్రౌండ్‌లో జరిగిన వన్డే వరల్డ్ కప్‌ను గెలిచి హిస్టరీ క్రియేట్ చేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. ఈసారి టీ20 వరల్డ్ కప్‌ను కూడా ముద్దాడాలని కసితో ఉంది. కానీ, ఈ మెగా టోర్నీ కంటే ముందు టీమిండియా ప్రిపరేషన్స్ అంత ఆశాజనకంగా ఏమీ లేవు.. ఇంగ్లాండ్‌తో జరిగిన 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 2--1 తేడాతో చేజార్చుకుంది. తొలి మ్యాచ్ గెలిచి మంచి లీడ్ సాధించినప్పటికీ.. ఆ తర్వాత వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోవడం ఫ్యాన్స్‌ను కాస్త కంగారు పెడుతుంది.

**టీమిండియా రీసెంట్ గ్రాఫ్:**
ఇంగ్లాండ్ సిరీస్: 2-1తో ఓటమి (వరల్డ్ కప్‌కు ముందు ఆఖరి సిరీస్).
సౌతాఫ్రికా సిరీస్: 4-1తో ఘోర పరాజయం.
ఆస్ట్రేలియా పర్యటన: ఇదే ఏడాది మొదట్లో ఆస్ట్రేలియా గడ్డపై 2-1తో చారిత్రాత్మక సిరీస్ విజయం.
శ్రీలంక సిరీస్: గత డిసెంబర్‌లో లంకను 5-0తో క్లీన్ స్వీప్ చేసిన భారత్

# ముంబై ఎయిర్‌పోర్ట్‌లో కోహ్లీ సందడి.. పాపారాజీలతో ఫన్నీ డిస్కషన్ వైరల్




**హైదరాబాద్ పెన్ పవర్:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును ఐపీఎల్ 2026 విజేతగా నిలిపి, వరుసగా రెండోసారి టైటిల్ గెలిచిన ఆనందంలో ఉన్న మాజీ భారత కెప్టెన్ విరాట్ కోహ్లి మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాడు. (2026, జూన్3న) ముంబై ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న కోహ్లీని కవర్ చేయడానికి ఫోటోగ్రాఫర్లు (పాపారాజీలు) ఎగబడ్డారు. క్యాజువల్ వైట్ టీ-షర్ట్‌లో ఎంతో కూల్‌గా కనిపించిన సూపర్‌స్టార్.. కెమెరాలకు నవ్వుతూ ఫోజులు ఇచ్చాడు. అయితే, ఫోటోలు తీసుకున్న తర్వాత కోహ్లి సరదాగా క్యా కర్నా హై అభీ? (ఇప్పుడు ఏం చేయాలి మరి?) అని హిందీలో అనడంతో అక్కడ నవ్వులు విరిశాయి.

**ఐపీఎల్ విజయం తర్వాత బృందావనంలో కోహ్లీ దంపతులు:**
ముంబై ఎయిర్‌పోర్ట్‌కు రావడానికి ఒక రోజు ముందే, విరాట్ కోహ్లి తన భార్య అనుష్క శర్మతో కలిసి ఆధ్యాత్మిక నగరమైన బృందావనాన్ని సందర్శించారు. అక్కడ ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ప్రేమానంద్ మహారాజ్ ను కలుసుకుని ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు ఆశ్రమంలో గడిపిన ఈ జంట.. ఆ ప్రైవేట్ సమావేశం ముగించుకుని బయటకు వచ్చేటప్పుడు నుదుట చందనం, త్రిపుండ్రం ధరించి కనిపించారు. ఆశ్రమ నిర్వాహకులు వారికి ఒక ప్రత్యేక పుస్తకాన్ని బహుకరించగా, వారు దానిని భక్తితో స్వీకరించారు. ఆ తర్వాత, కోహ్లి దంపతులు స్వామి హిట్ గోవింద్ శరణ్ ఆశ్రమాన్ని కూడా సందర్శించి వారి బ్లెస్సింగ్స్ తీసుకున్నారు.



# జాన్వీ హొయలు ఆ రేంజులో..



బాలీవుడ్ అందాల నటి జాన్వీ కపూర్ ప్రస్తుతం నటనా రంగంలోనే కాదు.. ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. అటు బాలీవుడ్‌లో తిరుగులేని ఫ్యాషనిస్టాగా గుర్తింపు పొంది.. ప్రతి ఈవెంట్‌లోనూ తన ప్రత్యేకమైన వస్త్రధారణతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఫ్యాషన్ ఇండస్ట్రీ - సినిమాల మధ్య సమతుల్యతను కాపాడుకుంటూ ఒక గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగే దిశగా అడుగులు వేస్తోంది. తాజాగా జాన్వీ ప్రముఖ పంజాబీ గాయకుడు ఆలపించిన గీతానికి అందమైన ఎక్స్ ప్రెషన్స్ తో ఇమ్మిటేట్ చేస్తూ యూత్ ని టీజ్ చేస్తోంది. ప్రస్తుతం ఈ వీడియో ఇంటర్నెట్ లో వైరల్ గా దూసుకెళుతోంది. ఇక కెరీర్ మ్యాటర్ కి వస్తే.. దక్షిణాది చిత్ర పరిశ్రమలో అగ్ర హీరోయిన్‌గా ఎదగాలనే లక్ష్యంతో ఉన్న జాన్వీకి, ఎన్టీఆర్ సరసన నటించిన -దేవర- చిత్రం భారీ విజయాన్ని అందించడమే కాకుండా.. ఇక్కడ బలమైన పునాదిని వేసింది. ప్రస్తుతం రామ్ చరణ్ సరసన -పెద్ది- సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తుందని భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో రామ్ చరణ్ లాంటి పాన్ ఇండియా హీరోలతో పనిచేయడం జాన్వీ మార్కెట్ వాల్యూను మరింత పెంచుతోంది. -పెద్ది- చిత్ర బృందం ఇప్పటివరకు జాన్వీకి సంబంధించిన విజువల్స్ ని కానీ.. తన పాత్ర స్వభావాన్ని వెల్లడించకుండా సస్పెన్స్ మెయింటెయిన్ చేస్తోంది. అయితే సుకుమార్ రైటింగ్స్ వంటి ప్రతిష్టాత్మక బృందాలు రూపొందిస్తున్న చిత్రాల్లో నాయిక పాత్రలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. జాన్వీ కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా నటిగా తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. నటిగా తన అస్తిత్వాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి జాన్వీకి ఇది సదవకాశం.జాన్వీ తన తల్లి శ్రీదేవి నటించిన -జగదేకవీరుడు అతిలోకసుందరి- వంటి క్లాసిక్ చిత్రాల సీక్వెల్స్‌లో నటించాలని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. -పెద్ది- తర్వాత రామ్ చరణ్‌తో కలిసి ఈ ప్రాజెక్ట్‌లో నటించాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే వైజయంతి అధినేత అశ్వినీదత్ నుండి ఇంకా ఎటువంటి స్పష్టత రాలేదు. ఇటువంటి వారసత్వ బాధ్యతాయుతమైన చిత్రాలు జాన్వీ కెరీర్‌కు మరో పెద్ద మలుపునిస్తాయనడంలో సందేహం లేదు. కెరీర్ ప్రారంభంలోనే ఉత్తరాది- దక్షిణాది వంటి విభిన్న ప్రాంతీయ భాషా చిత్రాలను ఎంచుకోవడం వల్ల జాన్వీ పలు రకాల పని సంస్కృతులను అర్థం చేసుకునే అవకాశం పొందుతోంది. ఇలాంటి పాన్-ఇండియా ప్రయత్నాలు జాన్వీని ఒక ప్రాంతానికి పరిమితం చేయకుండా గ్లోబల్ ఆడియన్స్‌కు చేరువ చేస్తున్నాయి. మొత్తానికి శ్రీదేవి నటవారసురాలిగా జాన్వీ ఎంచుకుంటున్న ఈ భారీ చిత్రాలు తనను కేవలం ఒక బాలీవుడ్ నటిగానే కాకుండా.. దక్షిణాదిలో కూడా తిరుగులేని స్టార్‌గా నిలబెట్టే అవకాశం ఉంది.



**సాక్షి మాలిక్ గోల్డెన్ గ్లామర్‌లో టైమ్‌లెస్ గాంభీర్యంతో మెరిసింది**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965